
# రాజీతోనే సమస్యల పరిష్కారం



- లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

8లో..

వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 010
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
డిసెంబర్ 12, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# తలతిక్క సర్వే

- ఓట్ల తొలగింపుకు భారీ కుట్ర
- 19 నుంచి 33 మధ్య వయసున్న యువతే టార్గెట్
- 2002 ప్రామాణికంగా జాబితా
- అప్పుడు మీరు ఎక్కడున్నారో చెప్పాల్సిందే
- మీ తండ్రే కాదు తాత, ముత్తాత పేరు ఇవ్వాల్సిందే
- కలెక్టరేట్ల సాక్షిగా తాజా బాగోతంలో అధికార బృందాలు
- ఉమ్మడి ఓరుగల్లులో కలకలం

(సామల సూర్యప్రకాష్, వరంగల్ వాయిస్ ప్రతినిధి)

ఇటీవల బీహార్ లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ కార్యక్రమాన్ని త్వరలో దేశవ్యాప్తంగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం యోచిస్తోంది. అయితే ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్లుగా కేంద్రం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందకముందే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టారు. చివరి సారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2002లో నిర్వహించిన ఎస్ఐఆర్ ద్వారా రూపొందించిన ఓటర్ల జాబితా ప్రామాణికంగా ఇంటింటి సర్వే నిర్వహించేందుకు ప్రభుత్వ బృందాలు బయలు దేరాయి. అయితే ఓటరు తనతో పాటు తల్లిదండ్రులిద్దరూ భారత పౌరులేనంటూ రుజువు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకుగాను తన తండ్రి పేరుతో పాటు తాత, ముత్తాత పేర్లను కూడా పొందుపర్చాల్సి ఉంటుంది. 1 జూలై 1987 కు ముందు భారతదేశంలో పుట్టిన ఓటర్లు తమ పుట్టిన తేదీతోపాటు పుట్టిన ప్రాంతాన్ని రుజువు చేసే పత్రం ఇస్తే సరిపోతుంది. 1 జూలై 1987 నుంచి 2 డిసెంబర్ 2002 మధ్య పుట్టిన వారైతే తమ తల్లి లేదా తండ్రికి సంబంధించిన పుట్టిన తేదీ, పుట్టిన ప్రాంతాన్ని రుజువు చేసే పత్రాలు సమర్పించాలి. లేకుంటే మీ ఓటు గల్లంతే..!





2లో..

## కొడకల్లారా..!

- మాజీలపై రెడ్యానాయక్ ఫైర్
- అందినంత సంపాదించుకొని తనను వీడారంటూ ఆవేదన



## 103 పెండింగ్ చాలన్స్

### వాహనం సీజ్ చేసిన ట్రాఫిక్ పోలీసులు

ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఒక బైక్ పై 103 పెండింగ్ చాలన్స్ ఉండడం ట్రాఫిక్ పోలీసులను విస్మయానికి గురి చేసింది. ఖాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో ఎస్సై కనక చంద్రం, ఏఎస్సై సంపత్ ఆధ్వర్యంలో కాజీపేట చర్చి ప్రాంతంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక బైక్ పై 103 పెండింగ్ చాలన్ లు ఉండడాన్ని ట్రాఫిక్ పోలిసులు గుర్తించారు. వీటికి గాను రూ.25,105 చెల్లించాల్సి ఉంది. దీంతో సదరు వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

– వరంగల్ వాయిస్, క్రైం





2లో..

## అష్టసిద్ధుల వ్రతం..

### అష్ట ఐశ్వర్యాలకు మూలం

- నేత్ర పర్వంగా అనగాష్టమి వ్రతాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆశ్రమం

## బీజేపీ విజయఢంకా..


- స్థానిక ఎన్నికల్లో చాటిన సత్తా
- ఫలించిన బీజేపీ నాయకుల కృషి



8లో..



# తలతిక్క సర్వే




- ఓట్ల తొలగింపుకు భారీ కుట్ర
- 19 నుంచి 33 వయసున్న యువతే టార్గెట్
- 2002 ప్రామాణికంగా జాబితా
- అప్పుడు మీరు ఎక్కడున్నారో చెప్పాల్సిందే
- మీ తండ్రే కాదు తాత, ముత్తాత పేరు ఇవ్వాల్సిందే
- కలెక్టరేట్ల సాక్షిగా తాజా బాగోతంలో అధికార బృందాలు
- ఉమ్మడి ఓరుగల్లులో కలకలం




**(సామల సూర్యప్రకాష్, వరంగల్ వాయిస్ ప్రతినిధి)**

ఇంట్లోనే ఉన్నారా...!
లేకుంటే... తస్మాత్ జాగ్రత్త...!!
మళ్లీ సర్వే పేరిట బృందాలు రెడీ..!!!
మీ పిల్లల పేర్లు ఓటర్ల జాబితాలో తొలగింపు..!!!!
2002 లో ఎక్కడున్నారో చెప్పాల్సిందే..!!!!!
ఇప్పటి ఐఎంఎంతో షురూ అయ్యే ఓటర్ ఐడీలు ఇక పనిచేయవ్.. ఏపీతో అప్పట్లో ఉన్న కార్డులు కావాల్సిందే.. లేకుంటే.. కనీసం అప్పుడు మీరు నివాసమున్న ఇంటి నెంబర్, మీ తండ్రి, తాత, ముత్తాత పేర్లు ఇస్తేనే మీ పిల్లల పేర్లు ఓటర్ల లిస్ట్ లో కొనసాగుతాయి.. లేకుంటే అంతే సంగతులు అంటూ ఇంటింటి సర్వేకు కలెక్టరేట్ల సాక్షిగా శ్రీకారం చుట్టాయి అధికార బృందాలు. 2002 కట్టాఫ్ పేరిట.. ఆ ఏడాది ఎక్కడున్నారో చెప్పాలని హుకుం జారీ చేస్తున్నారు.

ఇలా 19 నుంచి 33 ఏళ్ల మధ్య వయసున్న యువతను టార్గెట్ చేస్తున్నారు. ప్రస్తుత ఓటర్ల జాబితాలో.. ఈ ఏజ్ గ్రూప్ యువతను గుర్తించి 'రెడ్ మార్కింగ్' తో వారి వివరాల సేకరణలో అధికార బృందాలు నిమగ్నం కావడం కలకలం రేపింది. ఇదెక్కడో.. మారు మూల పల్లెల్లో కాదు.. తాజాగా హనుమకొండ–వరంగల్–కాజీపేట త్రినగరిలోనే గత రెండు రోజులుగా చేపట్టిన సర్వే సంచలనం కలిగిస్తోంది. ఈ తలతిక్క సర్వేపై వరంగల్ వాయిస్ ప్రతినిధి సేకరించిన వివరాల్లోకి వెళితే.. పలు ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి.

## ఉత్తర్వులే రానప్పటికీ..

ఈ సర్వేపై ఇటు ప్రభుత్వం.. అటు ఎన్నికల కమిషన్ నుంచి తాజాగా ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చేరనే లేదు.. అలాగే గ్రేటర్ వరంగల్ పరిధిలోని ట్రైసిటీస్ కు కూడా రాలేదన్న స్పష్టమైన ఆధారాలు లభించాయి. అయినప్పటికీ.. వస్తాయేమోనన్న ముందస్తు యోచనలో ఉన్న అధికారులెవరో ఇచ్చిన ఆదేశాలు ట్రైసిటీస్ లో అమలుకు నోచుకోవడం తీవ్ర గందరగోళానికి కారణమైంది. ప్రధానంగా 19 నుంచి 33 మధ్య వయసున్న యువత ఎక్కడున్నారనే అన్వేషణ అనేక అనుమానాలకు తావిస్తోంది.

## 2002 ఓటర్ కార్డు కావాల్సిందే..

ఇప్పటి యువత ఎప్పుడూ పుట్టారనే విషయాన్ని పక్కన పెట్టి మరీ...2002 నాటి ఏపీ సిరీస్ తో ఆరంభమైన ఓటర్ కార్డు కావాల్సిందే అంటూ సర్వే బృందాలు నిలదీయడం యువత తల్లితండ్రులను అయోమయానికి గురిచేసింది. ప్రభుత్వ ఆదేశాలంటూ.. నిబంధనల మేరకు ఇవ్వమని సర్వే బృందాలు ఇంటింటికి వెళ్లి అడుగుతున్నారు. దీని వెనుక ఉన్న మతలబ్ ఏమిటో ఎవరికీ అర్థం కాని దుస్థితి నెలకొంది. తండ్రి.. తాత.. ముత్తాతలు లేకున్నా.. వారి వివరాలు 2002 నాటికి ఎలా ఉన్నారో.. ఎక్కడ ఉన్నారో.. ఇంటి నంబర్లతో సహా ఇవ్వాలని హుకుం జారీ చేయడం సంచలనం కలిగిస్తోంది. అప్పటి ఓటర్ కార్డులు కావాల్సిందే అంటూ.. కనీసం ఆయా ఓటర్ కార్డుల నంబర్లు అయినా ఇవ్వాలని కోరడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

## ఇంటింటి సర్వే..

ఇప్పటికే ఇంటింటికీ తిరుగుతున్న బృందాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడాలేకుండా వార్డులు.. పంచాయతీలు.. అర్బన్ డివిజన్ల వారీగా గుర్తించిన యువత వివరాల సేకరణలో తలమునకలు కావడం సంచలనం కలిగిస్తోంది. ఎవరి ఇంట్లో అయినాసరే 19 నుంచి 33 ఏళ్ల వయసున్న పిల్లలు ఉన్నట్లయితే ఖచ్చితంగా వారి తండ్రి పేరు.. తాత.. ముత్తాతల వివరాలతోపాటు 2002 లో ఎక్కడ.. ఏ ఇంట్లో నివాసమున్నారో ఆ ఇంటి నెంబర్, అప్పటి ఏపీ ఓటర్ ఐడీ ఇవ్వాల్సిందే నంటూ డిమాండ్ చేస్తున్నారు.

దీనిపై.. సర్వే బృందాల్లోని అధికారులనుంచి వార్డు, బూత్, గ్రామ స్థాయి సిబ్బంది వరకు ఎవరూ కూడా స్పష్టమైన వివరాలు చెప్పలేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కనీసం బీఎల్వోలు, కలెక్టరేట్ ఉన్నతాధికారులు కూడా ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తున్నామంటూ చెప్పి దాటవేస్తున్నారు. గట్టిగా అడిగి నిలదీసిన వారికి మాత్రం 'బీహార్ తరహా సర్వే' అంటూ చెప్పి మరింత గందరగోళానికి తావిస్తున్నారు. అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాబితాలో కానీ.. ఎన్నికల కమిషన్ తాజా నిబంధనల్లో కానీ తెలంగాణ యువతకు సంబంధించి 19–33 మధ్య వయస్సున్న వారి వివరాల సర్వే చేపట్టాలని లేకపోవడం విశేషం.

## ఇకనైనా...

ఉన్నతాధికారులు మేల్కొని ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో.. ప్రధానంగా చారిత్రక ఓరుగల్లు కేంద్రంగా ట్రైసిటీస్ గా గుర్తింపు పొందిన వరంగల్, హనుమకొండ, కాజీపేట కేంద్రాల్లో కొనసాగుతున్న తాజా యువత సర్వే...19 నుంచి 33ఏళ్ల మధ్య ఉన్న వారిని 'రెడ్ లిస్ట్'లో పెట్టి మరీ.. వారి తాత.. ముత్తాతల వివరాలు ఓటర్ ఐడీలతో సహా ఎందుకు సేకరిస్తున్నారో స్పష్టం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందనడంలో మాత్రం అతిశయోక్తి లేదు.

# అష్ట సిద్ధుల వ్రతం.. అష్టఐశ్వర్యాలకు మూలం

- నేత్ర పర్వంగా అనగాష్టమి వ్రతాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆశ్రమం

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** అష్టసిద్ధులతో కూడిన అనగాష్టమి వ్రతం ఆచరిస్తే ఐశ్వర్యం, ఆరోగ్యంతోపాటు కోరుకున్న కోరికలన్నీ సిద్దిస్తాయని అవధూత దత్త పీఠం ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ అన్నారు. మార్గశిర బహుళ అష్టమి శుక్రవారం వరంగల్ ములుగు రోడ్డు ప్రాంతంలోని శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో ప్రధాన అనగాష్టమి వ్రతాన్ని నేత్ర పర్వంగా నిర్వహించారు. వెయ్యి మందితో సామూహికంగా కొనసాగిన అనగాష్టమి వ్రతంను దత్త ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన మహిళా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో ఆశ్రమం కిటకిట లాడింది. వ్రతం అనంతరం నైవేద్య నివేదన, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ జరిపించారు. అనంతరం మూడు వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వైవీ వామన్ రావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, చకిలం ఏకంబరం, కేతిరెడ్డి విజేందర్ రెడ్డి, నిమ్మల యుగంధర్, తోట శివ కుమార్, జూలూరి శ్రీనివాస్ రావు, వడ్డే రవీందర్, డాక్టర్ వద్దిరాజ్ శర్వాణి, వడిచర్ల శ్రీనివాస్, మెడిశెట్టి కుమారస్వామి, కర్రు ఓం ప్రకాష్, ఏసీపీ సత్యనారాయణతో పాటు దత్త పీఠం వేద పండితులు, ఆలయ అర్చకులు రాపాక గోపి, కృష్ణశర్మ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.





# కొడకల్లారా..!

- మాజీలపై రెడ్యానాయక్ ఫైర్
- అందినంత సంపాదించుకొని తనను వీడారంటూ ఆవేదన

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మాజీ మంత్రి, డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ కొందరు మాజీ ప్రజాప్రతినిధులపై రెచ్చిపోయారు. కొడకల్లారా అంటూ ఫైర్ అయ్యారు. డోర్నకల్ మండలంలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కొందరు తాను ఓడిన తర్వాత తనను వీడి అధికార పార్టీలో చేరి నేడు తనను ఒంటరిగా వదిలారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడో విడత సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం శుక్రవారం గొల్లచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పై విధంగా స్పందించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పదవిలో ఉన్నంతకాలం అనేక మందిని సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలుగా మార్చానని, నేడు తాను అధికారం కోల్పోవడంతో కొంతమంది తనను వీడి వేరే పార్టీలో చేరారన్నారు. రాజకీయాల్లో భాగంగా ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం ఇచ్చి వారి మాటను వినుకుంటూ అనేక మందిని దూరం చేసుకున్నానన్నారు. కానీ నేడు తాను ఓడిపోగానే అనేకమంది తనను దూరం పెట్టి అధికార పార్టీలో చేరారన్నారు. అభిమాన నాయకుడిగా వారి నటనను నమ్మి వారు చెప్పింది తూచా తప్పకుండా అమలు చేసుకుంటూ వచ్చినా నేడు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధే కనబడుతోందన్నారు. నూతనంగా ఎన్నికైనా ఎమ్మెల్యే రాంచంద్రనాయక్ ఏ మేరకు అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలన్నారు. డోర్నకల్ మండలంలో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భిక్షం రెడ్డి సమ్మిరెడ్డి, విద్యాసాగర్, బాలాజీ, శంకర్, పాండు నాయక్, శ్రీనివాస్ నాయక్, మోహన్, బాబు, వెంకటేశ్వర రావు, కాడెం ప్రశాంత్, బాబు, రాగవులు, సుధాకర్, గణేష్ సింగ్, పోటు జనార్దన్, కొత్త వీరన్న, గౌస్, యశోదర్, చంటి తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మ ఆచరణలోనే దేశ భవిష్యత్తు

## ◆ శివానంద గురు కల్చరల్ ట్రస్ట్




**వరంగల్ వాయిస్, వరంగల్:** సనాతన ధర్మ ఆచరణలోనే భారతదేశ భవిష్యత్తు ఇమిడి ఉందని, ఈ దిశగా యువత పాత్ర అత్యంత కీలకమని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. ఇందుకోసం వరంగల్‌లోని యువతను సనాతన మార్గంలో నడిచేలా ఒకే వేదికపైకి తీసుకురావడానికి ట్రస్ట్ సన్నాహాలు చేస్తోందన్నారు. ఈ మేరకు, డిసెంబర్ 14న సాయంత్రం 4 గంటలకు, విజయ టాకీస్ రోడ్‌లో గల శ్రీ శివానంద ఫంక్షన్ హాల్లో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమం ముఖ్య అంశం 'సనాతన ధర్మం – దేశ భవిష్యత్తు, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్య అభివృద్ధి', అన్నారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన స్థానిక మీడియా సమావేశంలో మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ మాట్లాడుతూ యువతలో నైపుణ్యం, విజ్ఞానం పెంచడం ద్వారానే ఆశించిన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. దానికి అనుగుణంగానే మనం మన భవిష్యత్ తరాలను తీర్చిదిద్దాలని, ప్రతి ఒక్కరూ నైపుణ్య అభివృద్ధిని పెంచుకోవాలని ఉద్బోధించారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకునే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలోనే ఐఫోకస్ స్ఫూర్తి కేంద్రం వరంగల్ బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని గోపీచంద్ వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా కుటుంబ సమస్యల పరిష్కారంతో పాటు, ఉద్యోగ, వృత్తి, వ్యాపార విషయాలలో సహకారం, వారి అభివృద్ధికి, కెరీర్ డెవలప్‌మెంట్ కి, ఉద్యోగ కల్పనకు కృషి చేయడం జరుగుతుందన్నారు. వివిధ రంగాలలో పెద్ద పెద్ద ఉద్యోగాలు, పదవులలో ఉన్న వారితో మన వాళ్లందరికీ అనుసంధానం చేయుట కొరకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న సీఈవోలు, మేనేజ్‌మెంట్ స్కిల్స్ కలిగిన ప్రముఖులు, ఉద్యోగ కల్పనలో ఉన్నత స్థాయిలో ఉన్న వారందరూ పాల్గొంటారని తెలిపారు. కాబట్టి, ప్రజలు, ముఖ్యంగా యువత, ఉద్యోగాన్వేషకులు , వ్యక్తిత్వం అభివృద్ధి చేసుకోదలుచుకున్న విద్యార్థులు, జీవితం సాఫల్యం చేసుకోదల్చుకున్న వారు, నగర ప్రముఖులు అందరూ తప్పక హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందూ పరిరక్షణ ట్రస్ట్ ఏపీ ప్రభుత్వ చైర్మన్ (రిటైర్డ్ ఐఏఎస్) దాసరి శ్రీనివాసులు, ఫ్రీలాన్స్ రచయిత, ప్రముఖ జర్నలిస్ట్ – చతుర్వేదుల సుబ్రహ్మణ్యం (విశిష్ట అతిథి), ఐఫోకస్ సీఈవో – వాసుదేవ శర్మ (విశిష్ట అతిథి), ప్రముఖ దేశ సేవకులు, యువత స్ఫూర్తి – దత్త వ్యాకరణం నాగేశ్వర రావు (విశిష్ట అతిథి)లు పాల్గొంటారు. ఈ సందర్భంగా గురువుగారి ప్రసాదం అందరికీ అందించబడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బండారు సాయినారాయణ, రామకృష్ణ, ఉమా శంకర్, ప్రణీత్, రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో రాణించాలి



**వరంగల్ వాయిస్, చిట్యాల:** విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకొని, చదువులలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని చిన్మయ మిషన్ టేకుమట్ల నిర్వాహకులు నేతల రాజయ్య ఉద్బోధించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ మేకల రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేకంగా మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతల రాజయ్య ముఖ్య అతిథిగా మాట్లాడుతూ జీవితంలో సమస్యలు ఎదురైనప్పటికీ, వాటిని ధైర్యంగా ఎదుర్కొని అనుకున్న లక్ష్యాలను సాధించడానికి నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రత అనేవి విద్యార్థిని, విద్యార్థుల జీవితానికి పునాది వంటివని, అవి బాల్యం నుండే అలవడాలని స్పష్టం చేశారు. తల్లిదండ్రుల కష్టసుఖాలను గుర్తెరిగి, గురువులు అందించే విజ్ఞాన విషయాలను, పాఠ్యాంశాలను ఆధారంగా చేసుకొని, తమ జీవిత లక్ష్యానికి కర్తలాగా ఉండాలని కోరారు. కష్టాలు మిమ్మల్ని పక్కకు నెట్టివేసినా, సమస్యల కారణంగా మీ గమ్యాన్ని మాత్రం వదులుకోవద్దని, వాటిని ధైర్యంగా ఎదురేగి పోరాడాలని సూచించారు. విజయం అనేది కత్తిమీద సాము లాంటిదని, దానిని ఎదుర్కొని జీవితంలో స్థిరంగా నిలబడాలని, అనవసరమైన భయ భ్రాంతులకు గురికావద్దని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు

## ◆ ఎంపీడీవో రవీంద్రనాథ్



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో జరగనున్న రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని, ఎన్నికల విధులలో పాల్గొనే ఉద్యోగులకు రెండవ విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహాదేవపూర్ మండలంలోని రైతు వేదికలో శుక్రవారం ఒక రోజు శిక్షణను నిర్వహించారు. ఈ మండలంలో 17న సర్పంచులకు, వార్డ్ మెంబర్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ శిక్షణకు మండలంలోని 162 పోలింగ్ స్టేషన్లకు ప్రిసైడింగ్ అధికారులుగా నియమితులైన ఉద్యోగులు, అలాగే 18 గ్రామపంచాయతీలకు స్టేజ్–2 రిటర్నింగ్ అధికారులుగా డ్యూటీ పడిన ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎ.రవీంద్రనాథ్ ఎన్నికల సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులది అత్యంత ముఖ్యపాత్ర అని తెలిపారు. పోలింగ్ నిర్వహణ రోజు ముఖ్యమైనది కాబట్టి, ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను ప్రతి ప్రిసైడింగ్ అధికారి తప్పకుండా చదవడమే కాకుండా, అందులోని అన్ని నియమాలను పాటించాలని సూచించారు. ఎన్నికల పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా ఉండవద్దని, విధులు నిర్వహించే వారికి అన్ని అంశాల పట్ల పూర్తి అవగాహన ఉండాలని కోరారు. ఎన్నికల విధులకు నియమించబడ్డ ఉద్యోగులు ఎలాంటి పార్టీలకు, అభ్యర్థులకు అనుకూలంగా ఉండకూడదని, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం మండల విద్యాధికారి ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ ఆఫీసర్ పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్ బాక్సులు, ఓటరు జాబితా కాపీ, ప్రిసైడింగ్ అధికారి డైరీ వంటి అన్ని విషయాలను ఒకటికి రెండుసార్లు చదువుకోవాలని సూచించారు. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత క్యూలో ఉన్న ఓటర్లకు స్లిప్పులు ఇవ్వాలని, చివరి వ్యక్తి ఓటు వేసిన తర్వాత క్యూ వద్దకు వెళ్లి ఎవరూ లేరని నిర్ధారించుకుని, ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీలు చేయాలని తెలిపారు. తహసిల్దార్ రామారావు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రమునకు వచ్చే ఓటర్లు తమ ఓటరు స్లిప్ తో పాటు, ప్రభుత్వం అనుమతించిన ఏదేని ఫొటో గుర్తింపు కార్డును కూడా చూపమని కోరాలని సూచించారు. ఫొటో గుర్తింపు కార్డు కలిగి ఉన్నవారికి మాత్రమే ఓటు వేయుటకు అనుమతించాలని, పోలింగ్ కేంద్రంలో జరిగిన ప్రతి సంఘటనను ప్రిసైడింగ్ అధికారి తనకు ఇవ్వబడిన డైరీలో తప్పకుండా నమోదు చేయాలని తెలిపారు. ఈ ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి ప్రభాకర్ రెడ్డి, మధుకర్ టీచర్లు టీఓటీలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రవీంద్రనాథ్, తహసిల్దార్ రామారావు, మండల విద్యాధికారి ప్రకాష్ తదితరులు హాజరయ్యారు.

# మిల్లు భవనం కూల్చి ఏడాది

## హామీలు అమలు చేయాలని డిమాండ్




**వరంగల్ వాయిస్, వరంగల్:** మిల్లు కార్మికుల భవనాన్ని కూల్చివేసి సంవత్సరం పూర్తయినా, అప్పటి మాజీ ఎమ్మెల్సీ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోకపోవడంపై రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. గురువారం గంగుల దయాకర్ ఆధ్వర్యంలో కాశిబుగ్గ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ సంఘాలు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, వామ పక్షాలు, విద్యార్థులు, మేధావులు ఈ అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. హామీ ఇచ్చిన మాజీ ఎమ్మెల్సీ మౌనంగా ఉండడం సరైంది కాదని వారు అభిప్రాయపడ్డారు. కూల్చివేసిన కార్మిక భవనం ముందునే తదుపరి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 16న ఉదయం 11 గంటలకు ఆల్ పార్టీస్ జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రజలు, కార్మికులు, కర్షకులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. ఈ నిరసన కార్యక్రమంలో కాంపెల్లి ప్రవీణ్, సముద్రాల పరమేశ్వర్, గడ్డం శరత్, పాలకుర్తి సత్యనారాయణ, జనగాం కుమారస్వామి, చిలువేరు రవీందర్, నూకల రాణి, డాక్టర్ కొణతం కృష్ణ, ఆకెన వెంకటేశ్వర్లు, పెరుమాళ్ళ లక్ష్మణ్, యశోద, వెంకటస్వామి, బన్న నర్సింగం, గద్దల శ్యామ్, గుత్తికొండ రవి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** తెలంగాణలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం పరకాల నియోజకవర్గంలోని కామారెడ్డిపల్లి, వెల్లంపల్లి, పోచారం, అలియాబాద్ గ్రామాలలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ వార్డుల వారీగా నియమించిన ఇంఛార్జులు అప్రమత్తంగా ఉండి, ప్రతి ఓటరును కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. బీఆర్ఎస్ అభివృద్ధిని గుర్తు చేయండి: గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు గుర్తు చేయాలని సూచించారు. గత రెండేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆయన విమర్శించారు. సాధారణ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల కోసం వస్తే నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బోగస్ హామీలతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కుతుందని ఎద్దేవా చేశారు. "ఓటమి భయంతో కాంగ్రెస్ నాయకులు... సర్పంచ్ ఎన్నికల్లో తాము బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేయకుంటే సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు ఆపేస్తామని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని" ధర్మారెడ్డి అన్నారు. వారి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, ప్రజలకు అండగా ఎల్లప్పుడూ బీఆర్ఎస్ ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ ఆహారమే ఆరోగ్యకరం

**◆ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి**



**వరంగల్ వాయిస్, వరంగల్:** సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న అనారోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని, సహజ సేంద్రీయ ఆహార ఉత్పత్తులను వినియోగించడమే ఉత్తమమని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన సహజ సేంద్రీయ ఆహార ఉత్పత్తుల ప్రదర్శనను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారని, దీనికి ప్రధాన కారణం సహజ ఆహారానికి దూరమవడమేనని ఆమె అన్నారు. రసాయనాలు కలిగిన ఆహార పదార్థాల వల్ల అనేక రకాల వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా ఉత్పత్తి చేసిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీర ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆమె స్పష్టం చేశారు. బహిరంగ మార్కెట్లో సేంద్రీయ ఉత్పత్తులు అధిక ధరలకు లభిస్తున్నప్పటికీ, కళాశాలలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో తక్కువ ధరలకు, నాణ్యమైన సహజ ఆహార ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. ప్లాస్టిక్ సంచుల వినియోగం పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని హెచ్చరిస్తూ, సహజ ఆహార ఉత్పత్తిదారులు తయారు చేస్తున్న బయో ప్లాస్టిక్ సంచులను ఉపయోగించాల్సిన ఆవశ్యకత ఉందని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెహమాన్, సహజ ఆహార ఉత్పత్తుల స్టాల్స్ నిర్మాణ అధికారి బయ్య సారయ్య, మిల్లెట్స్ ప్రమోటర్ శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, స్టాల్స్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**వరంగల్ వాయిస్, దేశాయిపేట:** ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ వాటి ప్రాముఖ్యతపై సరైన అవగాహన కలిగి ఉండాలని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.సుజాత తెలిపారు. శుక్రవారం దేశాయిపేట ప్రభుత్వ హైస్కూల్‌లో ట్రాఫిక్ నియమాలు, వాటి ప్రాముఖ్యతపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కె.సుజాత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యంగా ఈ క్రింది విషయాలను స్పష్టం చేశారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. టూ వీలర్ వాహనదారులు హెల్మెట్ ధరించడం, ఫోర్ వీలర్ వాహనదారులు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరిస్తూ ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, అలాగే లైసెన్స్ లేని వారు, మైనర్లు వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్ ఏర్పాటు చేసిన విషయాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు. చివరగా, విద్యార్థులు అన్ని రంగాల్లో మెరుగైన ప్రదర్శన చేయాలని ఆమె ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హైస్కూల్ బోధనా సిబ్బంది, 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థుల ఫిర్యాదుపై సివిల్ జడ్జి విచారణ



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని ఓగ్లాపూర్ ఎస్బీఐటీ ప్రాంగణంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చోటుచేసుకున్న సంఘటనపై పరకాల సివిల్ జడ్జి సాయి శరత్ విచారణ చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులను వేధిస్తున్నట్లు, కులం పేరుతో దూషించటం, అలాగే కాస్మోటిక్ చార్జీలను పక్కదారి పట్టిస్తున్న విషయాలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సులో కొందరు విద్యార్థులు ఉత్తరం వేయగా, అది అధికారులకు చేరింది. ఈ విషయాన్ని తెలుసుకున్న పరకాల సివిల్ జడ్జి సాయి శరత్ శుక్రవారం పాఠశాలను సందర్శించి, విద్యార్థులు చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టారు. నంతరం జడ్జి సాయి శరత్ మాట్లాడుతూ విచారణలో భాగంగా అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించామని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ తదితరుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నామని, విచారణకు సంబంధించిన పూర్తి అంశాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో జ్యోతి వరలక్ష్మి దేవి, ఎస్సై కొంక అశోక్, జిల్లా సమన్వయ అధికారి ఉమామహేశ్వరి, మండల విద్యాశాఖ అధికారి లకావత్ రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు రామప్ప డిఫెన్స్ కళాశాల విద్యార్థి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** స్థానిక ములుగు రోడ్డులో గల రామప్ప డిఫెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థి, ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పూర్తిచేసిన పెద్దల అరుణ్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ కు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ ఐలీ కర్ణాకర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లికి చెందిన అరుణ్ ఇటీవల జరిగిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు సెలక్షన్స్ లో విజయం సాధించారు. ఎంపిక ప్రక్రియలో అరుణ్ మూడు ముఖ్య దశలను విజయవంతంగా పూర్తిచేశారని డైరెక్టర్ వివరించారు. ఈ దశలో ఇంగ్లీష్, గణితం, ఫిజిక్స్, మరియు రీజనింగ్‌లో బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లీష్ పేపర్ మినహా, ఈ పరీక్ష ద్విభాషా పద్ధతిలో నిర్వహించబడుతుంది. తదుపరి దశకు వెళ్లడానికి అభ్యర్థులు నిర్దేశించిన కట్–ఆఫ్ మార్కులను సాధించడం తప్పనిసరి. శారీరక సామర్థ్య పరీక్ష,అనుకూలత పరీక్ష రాత పరీక్షలో షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులను రెండవ దశకు పిలుస్తారు. ఈ దశలో శారీరక సామర్థ్య పరీక్ష, శారీరక కొలతల పరీక్ష, పత్రాల ధృవీకరణ, అనుకూలత పరీక్షలు ఉంటాయి. ఈ పరీక్షలు అభ్యర్థి శారీరక ఓర్పు, సైనిక జీవితానికి అనుకూలత, పత్రాల ప్రామాణికతను అంచనా వేస్తాయి. శారీరక, అనుకూలత పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు వైమానిక దళ వైద్య బృందం ద్వారా సమగ్ర వైద్య పరీక్ష నిర్వహిస్తారు.వైద్య ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నవారిని మాత్రమే తుది ఎంపిక కోసం పరిగణిస్తారు. అరుణ్ ఈ అన్ని రౌండ్లను పూర్తిచేసుకున్న తర్వాత ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నుంచి ఆఫర్ లెటర్ అందుకున్నారని డైరెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా పెద్దల అరుణ్‌ను అభినందిస్తూ, గతంలో జరిగిన ఆర్మీ సెలక్షన్స్ లో తమ కళాశాల నుంచి 12 మంది విద్యార్థులు ఎంపికైన విషయాన్ని కర్ణాకర్ గౌడ్ గుర్తుచేశారు. ఈ విజయం మిగతా విద్యార్థులందరికీ ప్రేరణ కావాలని ఆయన ఆకాంక్షించారు. కాగా, గతంలో రామప్ప కళాశాల ద్వారానే ఇంటర్మీడియట్ పూర్తిచేసిన అరుణ్ సోదరి పెద్దాల అఖిల కూడా ఇంటర్మీడియట్ విద్యతో పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని సంపాదించి, ఈ సంవత్సరంలోనే దేశంలోనే ప్రముఖ విద్యాసంస్థ అయిన బిట్స్ పిలాని నుంచి ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేయడం విశేషం. అరుణ్‌ను కళాశాల డైరెక్టర్ తేజస్వి, వైస్ ప్రిన్సిపల్ తిరుపతి, ఫిజికల్ కోచ్ కమల్, అకాడమిక్ కోఆర్డినేటర్ వినోద్, జోనల్ మేనేజర్ పూర్ణచందర్, ఇతర అధ్యాపక బృందం అభినందించారు.

# ఎన్నికల విధుల్లో టీచర్లు.. బడికి తాళాలు




**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల సందడి నెలకొంది. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎన్నికల విధులను అప్పగించింది. మొదటి విడతలో ఎన్నికల నిర్వహణ గురువారం ముగిసింది. కానీ మండలంలోని ఇస్లావత్ తండా ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు విధులకు హాజరు కాలేదు. దీంతో పాఠశాలకు తాళం తీయకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్నం వరకు చూసి తిరిగి ఇంటి బాట పట్టారు. ఇదే విషయమై మండల విద్యాశాఖ అధికారిని వివరణ కోరగా ఉపాధ్యాయులు ఎన్నికల విధుల్లో ఉన్నారని, కొన్ని చోట్ల ఉప సర్పంచ్ ఎన్నికలు నిర్వహణ ముగియక పోవడంతో ఆలస్యమైందని, ప్రత్యామ్నాయంగా సీఆర్పీని పంపిస్తామని తెలిపారు.

# గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా

## కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి బాసని శాంతా రవి



**వరంగల్ వాయిస్, శాయంపేట:** గ్రామ ప్రజలు మెచ్చే విధంగా గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని, అందుకు తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి బాసని శాంతా రవి ప్రజలను కోరారు.శుక్రవారం ఆమె పద్మశాలి కుల పెద్దలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి బాసని శాంతా రవి మాట్లాడుతూ గతంలో ఐదు సంవత్సరాలు సర్పంచ్‌గా పనిచేసిన అనుభవంతో శాయంపేట గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రజలు తనను ఆశీర్వదించి, బ్యాట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా పద్మశాలి నాయకులు దిడ్డి రమేష్, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు వంగరి సాంబయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు బాసని ప్రకాష్, మామిడి మారుతి, బాసని నవీన్, మంత్రి రాజు, దిడ్డి ప్రభాకర్, తుమ్మ ప్రభాకర్, మామిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

# కోగిల్వాయిలో బీజేపీ అభ్యర్థుల ప్రచారం

## ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థన



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని కోగిల్వాయి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా, బీజేపీ పార్టీ బలపరిచిన సర్పంచి అభ్యర్థి చుక్క వనిత మహేందర్ మాదిగ మరియు వార్డు సభ్యులకు మద్దతుగా శుక్రవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా సర్పంచ్ అభ్యర్థి చుక్క వనిత మహేందర్ మాదిగ, 4వ వార్డు సభ్యుడు గడబోయిన రమేష్ యాదవ్, 5వ వార్డు సభ్యుడు జంగిలి నవ్య శ్రీ లకు మద్దతుగా బీజేపీ నాయకులు ఓట్లు అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కార్పొరేటర్లు స్వాతి చాడ, కోమల రావుల, గుజ్జుల వసంత పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు న్యాయం చేయాలి

## ● డా.చిన్నారెడ్డికి రామ రాజేష్ ఖన్నా వినతి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులకు న్యాయం చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు, ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన ప్రతినిధుల బృందం శుక్రవారం ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఇటీవల కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం జారీ చేసిన జీఓ 1195 ద్వారా కొన్ని క్యాడర్‌లను కాంట్రాక్ట్ నుంచి ఔట్‌సోర్సింగ్ లోకి మార్చారని డా.జి.చిన్నారెడ్డికి వివరించారు. ఈ మార్పు వల్ల ఉద్యోగులకు తీవ్రంగా నష్టం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలను విన్న డాక్టర్ జి.చిన్నారెడ్డి వెంటనే వైద్య ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు తో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఉద్యోగులను కాంట్రాక్టులోనే కొనసాగించాలని, ఔట్‌సోర్సింగ్‌కి పంపించవద్దని తెలియజేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జీఓ 1195ను సవరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ రామ రాజేష్ ఖన్నా నేతృత్వంలోని బృందం వినతిపత్రం అందజేసింది. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్, బుచ్చయ్య, అంజి, జయమ్మ, అలివేలు, జెన్.బీ, నార్సింగ్ శీను, కమలమ్మ, భద్రయ్య, రాధమ్మ, అలివేలు తో సహా సుమారు 50 మంది వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప పడిపూజ



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ నగరంలోని శంభునిపేట, బుడగ జంగాల కాలనీలో శుక్రవారం అయ్యప్ప పడిపూజ, మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పస్తం భిక్షపతి తమ నివాసంలో ఏర్పాటు చేశారు. ఆయన నారికేళ మాల ధరించి 18 సంవత్సరాలుగా మాలలో ఉంటూ ఈ సంవత్సరం ఈ వేడుకను నిర్వహించారు. స్థానిక పురోహితులు వల్లిదే ప్రదీప్ శాస్త్రి ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణ మంత్రాలతో అయ్యప్ప పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పస్తం భిక్షపతి కుటీర స్వాములు, గురు స్వాములు, అయ్యప్ప మాల ధరించిన స్వాములు భారీగా హాజరయ్యారు. అయ్యప్ప పడిపూజలో భాగంగా నిర్వహించిన భజనలతో శంభునిపేట బుడగ జంగాల కాలనీ ప్రాంతం డీజే.సాంగ్స్, మైకులతో అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది . భజన బృందం గాయకుడు కొల్లూరి యోగానంద్, గురు స్వామి కత్తి ఎల్లా గౌడ్, గురు స్వామి బజ్జూరి సుధాకర్, కంచ మల్లయ్య, అడుప వేణు, నల్ల తీగల వెంకన్న, సంతోష్, రాజసమయ్య, పరికిపండ్ల రాజు, కన్నస్వామి ప్రదీప్, కరుణాకర్, విశ్వం, సాయి, నితిన్, శేఖర్, పస్తం సత్యనారాయణ, నరేష్, రాజేందర్, స్విమ్మర్స్ కేదాశి రాజేష్, సురేందర్, రవి, రాజేందర్, జ్ఞానేశ్వర్, మంద కిషన్, కొండపల్లి రవీందర్, స్థానికులు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 14న 'షైన్' స్కాలర్‌షిప్ టెస్ట్



**వరంగల్ వాయిస్, బాలసముద్రం:** షైన్ జూనియర్ కళాశాలల్లో ఈ నెల 14వ తేదీ ఆదివారం ప్రత్యేకంగా 'షైన్ స్కాలర్‌షిప్ టెస్ట్' నిర్వహించనున్నట్లు కళాశాలల చైర్మన్ మూగుల కుమార్ యాదవ్ తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10:00 గంటల నుంచి 11:30 నిమిషాల వరకు జరుగుతుంది.ఈ సందర్భంగా మూగుల కుమార్ యాదవ్ మాట్లాడుతూ షైన్ కళాశాల ప్రారంభం నుంచే ఎందరో విద్యార్థినీ విద్యార్థులకు ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు అందిస్తూ రాష్ట్రంలోనే అగ్రగామి విద్యాసంస్థగా పేరొందిందని తెలిపారు. రాబోవు విద్యా సంవత్సరానికి గాను 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఈ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో పాల్గొని, వారి ప్రతిభను చూపించి, ఇంటర్ కాలేజీ ఫీజులో రాయితీ పొందే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు.ఈ టెస్ట్ మొత్తం 100 మార్కులకు నిర్వహించబడుతుంది. ఈ టెస్ట్ లో 100 మార్కులకు గాను 96-100 మార్కులు సాధించిన విద్యార్థులకు 100%, 91-95 మార్కులు సాధించిన విద్యార్థులకు 75%, 86-90 మార్కులు సాధించిన విద్యార్థులకు 50%, 81-85 మార్కులు సాధించిన విద్యార్థులకు 25% ట్యూషన్ ఫీజు రాయితీని మొదటి ఐదుగురు ఎంపీసీ, బీపీసీ విద్యార్థులకు అందిస్తారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ట్యూషన్ ఫీజు రాయితీ కల్పించబడుతుందన్నాను. కాబట్టి, ఆసక్తిగల ప్రతి ఒక్క విద్యార్థి ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని చైర్మన్ కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాలల డైరెక్టర్లు ముగుల రమ, ఎ. కవిత, మూగుల రమేష్ యాదవ్, ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, పి.శ్రీనివాస్, ప్రశాంత్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో ఏరులై పారిన మద్యం, డబ్బు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** రాష్ట్రంలో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికలలో మద్యం ఏరులై పారుతోందని , విచ్చలవిడిగా డబ్బు పంపిణీ జరుగుతోందని, అనేక ప్రలోభాలకు గురి చేస్తున్నారని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా ప్రజాస్వామ్యం పరిహసించబడుతున్నదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంకట్రాములు మాట్లాడుతూ ఏ ఎన్నికలైనా ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి కానీ, జనరల్ ఎన్నికలైనా, పంచాయతీ ఎన్నికలైనా డబ్బు మయంగా మారాయని అన్నారు. నోటుతో ఓటు కొనుక్కోవడం, మద్యం, మటన్, చికెన్, చీరలు, సారెలు పంపిణీ చేయడం ద్వారా ఓటును అంగడి సరుకుగా మార్చడం అత్యంత బాధాకరమన్నారు. ప్రజలను దోచుకుని, అక్రమంగా డబ్బు కూడబెట్టినవారు డబ్బు సంచులతో ఎన్నికలలో పోటీ చేస్తున్నారన్నారు. ఫలితంగా ఎన్నికల వ్యవస్థ ఓటును అమ్మేవారు, కొనేవారుగా తయారైందన్నారు. డబ్బులు కుమ్మరించి గెలవడం, తర్వాత అక్రమంగా సంపాదించడం ద్వారా రాజకీయాలను వ్యాపారంగా మార్చారని విమర్శించారు. ఈ అనైతిక కార్యకలాపాలను అరికట్టడంలో ఎన్నికల కమిషన్, సంబంధిత అధికారులు ఘోరంగా విఫలమైనారని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇది పెను ప్రమాదం వాటిల్లినట్లేనని హెచ్చరించారు. ప్రజాస్వామ్యవాదులు, స్వచ్ఛంద సంస్థలు చొరవ తీసుకొని కృషి చేయాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఓటును అమ్ముకోకుండా, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా చైతన్యంతో ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

# తాడిచర్ల ఓసీపీలో రక్షణ పక్షోత్సవాలు




**వరంగల్ వాయిస్, మల్హర్:** వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా, తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టును శుక్రవారం సేఫ్టీ కమిటీ కన్వీనర్, సభ్యులు సందర్శించారు. సందర్శకుల బృందం మైన్‌లో ఉన్న అన్ని విభాగాలను తనిఖీ చేసి, రక్షణకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సేఫ్టీ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... మైన్‌లో కచ్చితమైన రక్షణ చర్యలు పాటిస్తున్న పద్ధతి పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఒక మైన్‌లో తీసుకునే రక్షణ చర్యలపైనే ఆ మైన్ భవితవ్యం ఆధారపడి ఉంటుందని వారు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ వెంకటరమణ, మైన్ ఏజెంట్ జీవకుమార్, సభ్యులు జాకీర్ హుస్సేన్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ప్రకాష్, జెన్కో జీఎం మోహన్రావు, వైస్ ప్రెసిడెంట్లు శ్రీధర్, ప్రభాకర్ రెడ్డి, కేఎస్ఎన్ మూర్తి, మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ సురేష్ బాబు పాల్గొన్నారు.

# నడికూడలో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ప్రచారం



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో భాగంగా, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి శుక్రవారం విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. మండలంలోని కౌకొండ, ముస్తాలపల్లి, చర్లపల్లి, నార్లపూర్, వరికోల్, పులిగిల్ల, రాయపర్తి, నర్సక్కపల్లి, నడికూడ గ్రామాలలో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి పర్యటించారు. ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించిన ప్రధాన సర్పంచ్ అభ్యర్థులు కౌకొండ: మూర్తలు మోర్తాల కళ్యాణి రాజు, ముస్తాలపల్లి: కసుబోజుల వేణు చారి, చర్లపల్లి: రావుల పద్మ నారాయణ, నార్లపూర్: రవీందర్ యాదవ్, వరికోల్: మంద శరత్, నడికూడ: కుడ్ల మలహాల్ రావు లు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తమ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తుందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను, వార్డు మెంబర్లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ, కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ ఆచార్య, కార్యనిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ వలబోజు మోహన్ రావు, కన్వీనర్ పొన్నెకంటి శ్రీనివాసాచారి, కోఆర్డినేటర్ డాక్టర్ వేముల తిరుపతిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో పురస్కారాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ పురస్కారం, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, స్పోర్ట్స్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, యూత్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, ఉమెన్ ఇండియన్ ఐకాన్ పురస్కారం, భారత స్ఫూర్తి కిరీటి పురస్కారం, నటరాజ పురస్కారం, మహానంది పురస్కారం లు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈవెంట్ ఆర్గనైజర్స్, డాన్స్ మాస్టర్లు, యాంకర్లు, సాహిత్యం, రచన, కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం (భరతనాట్యం, కూచిపూడి), కోలాటం, చిత్రలేఖనం, శిల్పి, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, ఇంద్రజాలం, ముఖాభినయం, హరికథ, ఒగ్గు కథ, బుర్రకథ, రంగస్థల కళాకారులు, వృత్తిపరమైన రంగాలు: విద్య, వైద్యం, వాస్తు, జ్యోతిష్యం, భక్తి, పురోహితం, యోగా, క్రీడా, సామాజిక సేవ, షార్ట్ ఫిలిం, పర్యావరణ పరిరక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యవసాయం, కరాటే, మ్యాజిక్, టీవీ నాటక కళాకారులు, వాయిద్య కళాకారులు, ఇతర రంగాలు: డోలక్, హార్మోనియం, భజన కళారంగం, యువజన మహిళా సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థులు, గ్రామీణ అభివృద్ధి వారు ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పురస్కారాల ప్రదానోత్సవం జనవరి 25న వరంగల్ నగరంలో నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని పూర్తి వివరాలకు 9100174351, 9494400158 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# గ్రామ పాలన అధికారుల కమిటీ ఏకగ్రీవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మండలంలోని గ్రామ పాలన అధికారుల మండల కమిటీని శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీలో ముఖ్య పదవులకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.నూతన కమిటీ మండల అధ్యక్షురాలు కుందనపల్లి అరుణ, మండల గౌరవ అధ్యక్షుడు పి.అశోక్ రావు, మండల ప్రధాన కార్యదర్శి వి.ప్రత్యూష, మండల కోశాధికారి పి.రేణుక, సహాయ కార్యదర్శి జె.శ్రీలత రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ సూర రాజు, ఈసీ మెంబర్ జై విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# యాంటీ-సెక్సువల్ హరాస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయంలోని "యాంటీ-సెక్సువల్ హరాస్‌మెంట్ సెల్" ఆధ్వర్యంలో ఈనెల 20న సెనెట్ హాల్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వేదన సెల్ సంచాలకులు డాక్టర్ ఆర్.మేఘనా రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను వైస్ ఛాన్సలర్ (వీసీ) ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం చేతుల మీదుగా విడుదల చేశారు. డాక్టర్ మేఘనా రావు మరిన్ని వివరాలు వెల్లడిస్తూ అవగాహన కార్యక్రమానికి ముందుగా, 18న ఇంజనీరింగ్ కాలేజీ (కో-ఎడ్యుకేషన్)లో షార్ట్ ఫిలిం పోటీలు, రంగోలి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మొదటి, రెండవ, మూడవ బహుమతులు ప్రధానం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో లైంగిక వేధింపుల నివారణ, చట్టపరమైన హక్కులపై అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

# రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఈ నెల 26 నుంచి 28 వరకు మేడ్చల్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల కోసం క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు, హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ క్రీడామైదానంలో 11వ సబ్ జూనియర్ టెన్నికాయిట్ బాలబాలికల ఒక్కరోజు క్రీడా పోటీలను కాంగ్రెస్ యూత్ నాయకుడు విష్ణు రెడ్డి ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు మేడ్చల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ కార్యక్రమంలో టెన్నికాయిట్ రాష్ట్ర కోశాధికారి అల్వాల రాజ్ కుమార్, వరంగల్ జిల్లా సెక్రెటరీ గోకారపు శ్యాం కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి జహూర్, పీటీలు/పీడీలు నరసయ్య, శ్రీధర్, శ్రీనివాస్, నిర్మల, సీనియర్ క్రీడాకారుడు శ్రీనివాస్, సీతారాం పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు

**వరంగల్ వాయిస్, నల్లబెల్లి :** మండలంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మండలం పరిధిలోని బజ్జూతండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు సహా పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ సర్పంచ్ జాటోత్ జీవులా, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు జాటోత్ లాలు, వీరితో పాటు జరుపల రామ్ సింగ్, అజ్మీరా అరుణ, హార్జీ, లావుడియా భద్రు, సారయ్య, లావుడియా బాబురావు, తేజావత్ కమలమ్మ, జాటోత్ పద్మ, భారతి, శోభ, వినోద, రాధా కుటుంబాలు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ చేరికల కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, పాక్స్ ఛైర్మన్, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేయూ అభివృద్ధి నిధుల మంజూరుకు కృషి

**● ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ**



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడంలో ప్రజా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి నిధుల కేటాయింపు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయంగెస్ట్ హౌస్‌లో రిటైర్డ్ ప్రొఫెసర్ల సంఘం (కుర్తా), రిటైర్డ్ నాన్-టీచింగ్ ఉద్యోగుల సంఘం ఆహ్వానంపై జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశానంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.1000 కోట్ల రూపాయలు మంజూరు చేసిన నిర్ణయాన్ని అభినందించారు. కేయూకు సమాన ప్రాధాన్యత: అదే విధంగా కాకతీయ విశ్వవిద్యాలయానికీ సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర తెలంగాణ విద్యార్థుల ఉన్నత విద్య అవకాశాలను బలోపేతం చేయాలని విశ్రాంత ఆచార్యులు, ఎన్జీవో సంఘ ప్రతినిధులు కోరారు. గత రెండు దశాబ్దాలుగా రాష్ట్ర విశ్వవిద్యాలయాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని వారు స్పష్టం చేశారు. యూనివర్సిటీ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి చూపిన చొరవకు సంఘాలు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపాయి. ఓయూ తరహాలో కేయూకు కూడా నిధులు మంజూరుకు జిల్లా ప్రతినిధులందరం కలిసి సమిష్టిగా చొరవ తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాకతీయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కలిసి పని చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు సదానందం, కూరపాటి వెంకట్ నారాయణ, రవీందర్, ఎర్రగట్టు స్వామి, ఎర్రం రామ్ రెడ్డి, సమ్మయ్య, కందకట్ల సుధాకర్, అలాగే విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు నాగేశ్వరరావు, కృష్ణమాచారి, ప్రభాకర్, మల్లయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దొంగ హామీలతో మోసం

**◆ మాజీ మంత్రి ఎర్రబెల్లి విమర్శలు**



**వరంగల్ వాయిస్, ఐనవోలు:** మండలంలో స్థానిక సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి దయాకర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దొంగ 420 హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ఫెయిల్ అయ్యారని ఆరోపించారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ విషయంలో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎస్టీలను బాగుచేసింది బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ అయితే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీ బిడ్డల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. మహిళలకు ఇస్తున్నటువంటి ఇందిరమ్మ చీరల పంపిణీలో కమిషన్ల కక్కుర్తితో మహిళా సంఘాల పేరుతో విడుదల చేసిన రూ.450 కోట్ల రూపాయల రుణంలో పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుల పక్షాన నిలిచిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. రైతులకు రైతు బంధు, రైతు భరోసా పథకం ఇచ్చి రైతుకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు కేసీఆర్ గారు అని ప్రజలకు తెలియజేశారు. ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రజలకు దిశానిర్దేశం చేస్తూ... ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ వాళ్లు వస్తే, ప్రభుత్వం ఇచ్చిన దొంగ హామీలను నిలదీసి ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.

# కేయూ స్వర్ణోత్సవ విద్యార్థిగా గర్వపడాలి

**◆ వీసీ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాల విభాగాల మొదటి సంవత్సర విద్యార్థుల కోసం విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన "ఇండక్షన్ ప్రోగ్రాం"లో వైస్ ఛాన్సలర్ (వీసీ) ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. వీసీ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేయూ స్వర్ణోత్సవ సంవత్సరంలో ప్రవేశించిన విద్యార్థులుగా గర్వపడాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీలో వనరుల లభ్యత మేరకు సదుపాయాలు కల్పిస్తామని, వాటిని అభిలషణీయ స్థాయికి వినియోగించుకోవాలని అన్నారు. గ్రామీణ ప్రాంత, మొదటి తరం విద్యార్థులుగా మీలో ఉన్న పట్టుదల, ఆసక్తిని కొనసాగిస్తూ ఉన్నత లక్ష్య సాధన, రోల్ మోడల్‌గా ఎదగడం, ప్రణాళికాబద్ధంగా కష్టపడే తత్వంపై దృష్టి పెట్టాలని సూచించారు. పరిపక్వత చెందిన పీజీ విద్యార్థులుగా నాలెడ్జ్, ఆటిట్యూడ్, స్కిల్స్, లీడర్‌షిప్, వ్యక్తిత్వంపై శ్రద్ధ పెట్టి, వాటిని పెంపొందించుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు. నాణ్యమైన విద్యను అందించటమే విశ్వవిద్యాలయ లక్ష్యం అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయాన్ని డ్రగ్ రహిత , ఆల్కహాల్ రహిత క్యాంపస్‌గా మర్చుకుందాం అన్నారు. వీసీ మాట్లాడుతూ, త్వరలో క్యాంపస్‌లో "ముఖ గుర్తింపు హాజరు"ను తీసుకోని వస్తున్నట్టు తెలిపారు. న్యాక్+ గ్రేడ్, కే-హబ్: కాకతీయ విశ్వవిద్యాలయం న్యాక్ A+ గ్రేడ్ యూనివర్సిటీ అని, రూసా నిధులతో కే-హబ్ ను వినియోగంలోనికి తీసుకువస్తున్నట్టు, తద్వారా అంకురాలకు ఊతం లభిస్తుందని తెలిపారు. ఆంగ్ల భాష పై పట్టు సాధిస్తే ఉపాధి, అభివృద్ధికి అవకాశాలు ఉంటాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం మాట్లాడుతూ కేయూకు ఎంతో గొప్ప పూర్వ విద్యార్థులు ఉన్నారని, పేద, గ్రామీణ విద్యార్థులను నాయకులుగా మార్చిన యూనివర్సిటీ అని కొనియాడారు. ఉన్న మౌలిక వసతులు వాడుకోవాలని సూచించారు. ర్యాగింగ్‌కు (Ragging) దూరంగా ఉండాలని, పాల్పడితే చట్ట పరిధిలో కఠిన చర్యలు ఉంటాయని ఏసీపీ జితేందర్ రెడ్డి హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కెరీర్ పై దుష్ప్రభావం ఉంటుందన్నారు. డీసీపీ పి. రమేష్ కుమార్ (నార్కోటిక్స్) మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిస కావద్దని, డ్రగ్స్ వాడిన, కలిగి ఉన్న, అందించిన చట్టరీత్యా నేరం అన్నారు. మొదట సిగరెట్‌తో, ఆ తర్వాత గంజాయితో, అనంతరం సింథటిక్ డ్రగ్స్‌తో బానిస అవుతున్నారని, రెండు సంవత్సరాలలో జీవితం బుగ్గిపాలు అవుతుందని హెచ్చరించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, అవసరమైతే 1908కు కాల్ చేయాలని సూచించారు. ప్రముఖ న్యాయవాది మాతంగి రమేష్ బాబు "లైంగిక వేధింపులు, విద్యార్థుల హక్కులు" అనే అంశంపై మాట్లాడుతూ... ప్రతి కళాశాలలో ఇంటర్నల్ కంప్లైంట్ సెల్ ఉండాలని, ఫిర్యాదుపై 90 రోజుల్లో చర్య తీసుకోవాలని, కంప్లైంట్ వివరాలు గోప్యంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి మాట్లాడుతూ చదువుతో పాటు నైపుణ్యాలపై శ్రద్ధ పెట్టాలని, విద్యార్థుల సౌకర్యం కోసం విశ్వవిద్యాలయంలో 17 సెల్‌లు ఉన్నాయని తెలిపారు. వసతి గృహాల సంచాలకులు డాక్టర్ ఎల్.పి.రాజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని, హాస్టల్‌లలో ధూమపానం, మద్యపానం, మాదకద్రవ్యాలు కలిగి ఉండటం నేరం అన్నారు. డాక్టర్ బి. రాధిక రాణి మాట్లాడుతూ, కేంద్ర గ్రంథాలయంలో 1.40 లక్షల పుస్తకాలు, ఆన్‌లైన్ జర్నల్స్, పోటీ పరీక్షలకు సంబంధించిన సెల్ ఉదయం 8:00 గంటల నుంచి రాత్రి 8:00 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సభ ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ కోలా శంకర్ స్వాగతం పలకగా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. మమత వందన సమర్పణ గావించారు.



# సరిహద్దుల్లో సర్జికల్ స్ట్రైక్

## అఖండ`2లో బాలయ్య శివతాండవం

బాలకృష్ణకథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన 'అఖండ' ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో అందరికీ తెలిసిందే. అఘోరగా బాలకృష్ణ నటన, తమన్ సంగీతం, బోయపాటి టేకింగ్ సినిమాను విజయ పథంలో నడిపాయి. ఆ చిత్రానికి కొనసాగింపుగా ఇప్పుడు 'అఖండ2: తాండవం' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. టిబెట్ సరిహద్దుల్లో మొదలయ్యే కథ ఇది. శత్రుదేశమైన చైనాకు చెందిన ఆర్మీ అధికారులు మన భారతీయుల నమ్మకాల్ని దెబ్బకొట్టాలని కుంభమేళాని లక్ష్యంగా చేసుకుని బయోవార్‌కి దిగుతారు. వాళ్లు తలపెట్టిన కుట్రతో కుంభమేళాలో పవిత్రస్నానం చేసిన చాలామంది కొన్ని నిమిషాల వ్యవధిలోనే అపస్మారక స్థితికి చేరుకుంటుంటారు. అందుకు విరుగుడుగా డీఆర్‌డీవోలో శాస్త్రవేత్తలు యాంటీ డాట్ వాక్సిన్‌ని కనిపెడతారు. అది తెలుసుకున్న శత్రువులు ల్యాబ్‌ని నాశనం చేసి, శాస్త్రవేత్తలందరినీ చంపేస్తారు. ఆ బృందంలో ఉన్న యువ శాస్త్రవేత్త జనని (హర్షాలీ మల్హోత్రా) ఒక్కరే వ్యాక్సిన్‌తో బయటపడుతుంది. అది పసిగట్టిన శత్రవులు ఆమెని వెంటాడతారు. ఆమెని రక్షించేందుకు రుద్ర సికిందర్ అఘోరా (బాలకృష్ణ) రంగంలోకి దిగుతాడు. జనని ఆపదలో ఉన్న విషయం అఘోరాకి ఎలా తెలిసింది? శత్రువుల్ని అఘోరా ఎలా ఎదిరించి, భారతదేశం, సనాతన హైందవ ధర్మం గొప్పతనాన్ని ఎలా చాటి చెప్పారు? జననికీ, అనంతపురం ఎమ్మెల్యే బాల మురళీకృష్ణ (బాలకృష్ణ)కీ సంబంధం ఏమిటి? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ఈసారి కథని సరిహద్దులు దాటించారు దర్శకుడు బోయపాటి శ్రీను. అఘోరా పాత్రకు మరింత డోస్ పెంచి బాలకృష్ణతో సర్జికల్ స్ట్రైక్ చేయించారు. సనాతన ధర్మం, భారతీయుల నమ్మకాలు, వేదజ్ఞానాల గొప్పతనాన్ని అఘోరా పాత్రలోని బాలకృష్ణతో చెప్పిస్తూ సినిమాని నడిపించారు. మాస్ హీరోల్ని చూపించడంలో బోయపాటి శైలే వేరు. ఆయనకు బాలకృష్ణ తోడయ్యారంటే ఇక వెనక్కి తిరిగి చూసుకోరు. శివుడు పూనిన అఖండ పాత్ర కావడంతో బోయపాటి శ్రీను తనలోని మాస్ ఎలివేషన్లు మరింత పదునెక్కాయి. అయినా అక్కడ అఖండ పాత్ర కావడంతో నమ్మాల్సిందే అన్నట్టుగా ఉంటాయి ఆ సన్నివేశాలు.

ఒకపక్క యాక్షన్... మరోవైపు పదునైన సంభాషణలతో సినిమాని నడిపించిన తీరు మెప్పిస్తుంది. అభిమానులకైతే థియేటర్లలో పూనకాలే. అంచనాలకి ఏమాత్రం తీసిపోకుండా సాగే సినిమా ఇది. అఖండ రీక్యాప్‌తో ఈ సినిమా మొదలవుతుంది. అక్కడి నుంచి టిబెట్ సరిహద్దుల దగ్గర సంఘర్షణ.. దేవుడిపై భారతీయులకు ఉండే నమ్మకంపైన దెబ్బ కొట్టాలని శత్రుదేశమైన చైనా పన్నాగం పన్నడం కోసం ఎలాంటి వ్యూహాల్ని రచించారు అన్నది సినిమాలో కీలకం. దీంతో ఎక్కువశాతం 'అఖండ' టెంప్లేట్‌లోనే సాగుతుంది. తొలి భాగంలో ఫ్యాక్షనిస్టులపై యుద్ధం చేస్తాడు మరో బాలకృష్ణ. ఇందులోనేమో మత్తు మందుల్ని సరఫరా చేసే అంతర్రాష్ట్ర ముఠాపై సమర శంఖం పూరిస్తాడు. బాలమురళీకృష్ణ పరిచయ సన్నివేశాలు, ఎలివేషన్లు మాస్ ప్రేక్షకులకు పండగే. ఆ తర్వాత సన్నివేశాలే కాస్త సాగదీతగా అనిపిస్తాయి. విరామానికి ముందు ఎపిసోడ్‌తో సినిమా మళ్లీ గాడిలో పడుతుంది. అఘోరా ప్రవేశంతో థియేటర్ దద్దరిల్లిపోతుంది. ప్రథమార్థంతో పోలిస్తే ద్వితీయార్థం మరింత హైలైట్. బాలయ్య అసలు సిసలు తాండవం విరామం తర్వాతే మొదలు పెడతాడు. అఘోరా పాత్రలోని రెండు కోణాలూ తెరపై కనిపించి ప్రేక్షకుల్ని అలరిస్తాయి. తాంత్రికుడైన నేత్ర ఎపిసోడ్ మొదలుకొని హనుమాన్, శివుడు ఎపిసోడ్స్ సహా తల్లి సెంటిమెంట్, దేశభక్తి, హైందవధర్మం నేపథ్యం వరకూ దాదాపుగా ప్రతీ సన్నివేశం రోమాంచితమే. ముఖ్యంగా తల్లి దగ్గర సన్నివేశాల్లో మలుపు భక్తిని, భావోద్వేగాల్ని పంచుతుంది. సర్జికల్ స్ట్రైక్ అంటూ సరిహద్దుల్లో శత్రుసైన్యంతో తలపడే సన్నివేశాలు, వేదభూమి అయిన భారతదేశం గొప్పతనం గురించి చెప్పే సన్నివేశాలు సినిమాకి ప్రధానబలం.

# దురంధర్ అద్భుతం


సినిమా చూసి ప్రశంసలు కురిపించిన అల్లు అర్జున్ బాలీవుడ్‌లో కలెక్షన్ల వర్షం కురిపిస్తున్న 'ధురంధర్' సినిమాపై ప్రశంసల వర్షం కురిపించాడు అగ్ర కథానాయకుడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ . తాజాగా ఈ సినిమాను వీక్షించిన బన్నీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. ఇప్పుడే 'ధురంధర్' సినిమా చూశాను. అత్యుత్తమ నటన, అద్భుతమైన సాంకేతిక అంశాలు, అద్భుతమైన సౌండ్‌ట్రాక్‌లతో కూడిన అద్భుతమైన చిత్రం ఇది. నా సోదరుడు రణ్‌వీర్ సింగ్ తన నటనతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. సినిమా మొత్తానికే హైలైట్‌గా నిలిచాడు. అలాగే అక్షయ్ ఖన్నా పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ తమ తమ పాత్రల్లో జీవించారు అని చెప్పవచ్చు. అలాగే హీరోయిన్ సారా అర్జున్ నటన కూడా ఆకట్టుకునేలా ఉంది. ఈ సినిమాను నిర్మించిన సాంకేతిక నిపుణులు, నటీనటులు, సిబ్బంది, జ్యోతి దేశ్‌పాండే, జియో స్టూడియోస్‌కు నా అభినందనలు. అలాగే అన్నిటికంటే ముఖ్యంగా? ఈ చిత్రానికి కెప్టెన్, అద్భుతమైన ఫిల్మ్ మేకర్ ఆదిత్య ధర్. మీరు పూర్తి పట్టుదలతో ఒక గొప్ప దర్శకుడిగా ఈ సినిమాను విజయవంతంగా రూపొందించారు. నాకు సినిమా చాలా నచ్చింది! అందరూ తప్పకుండా ఈ సినిమా చూడండి అల్లు అర్జున్ రాసుకొచ్చాడు.



# 3 రోజెస్.. వెబ్ సీరిస్ రెండో సీజన్

తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఆహా' లో సూపర్ హిట్ అయిన '3 రోజెస్' వెబ్ సిరీస్ ఇప్పుడు రెండవ సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సీజన్ 2 ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. మొదటి సీజన్‌లో ఇషా రెబ్బా, పాయల్ రాజ్‌పుత్, పూర్ణ ప్రధాన పాత్రల్లో నటించగా.. ఈ సీజన్ 2లో ఇషా రెబ్బాతో పాటు రాశీ సింగ్ మరియు కుషిత కల్లపు కొత్త 'రోజెస్'గా కనిపించనున్నారు. కమెడియన్ వైవా హర్షతో పాటు సత్య కూడా నవ్వులు పూయించడానికి రెడీగా ఉన్నారు. ఎస్.కె.ఎన్ నిర్మాణంలో, కిరణ్ కారవల్ల దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ డిసెంబర్ 13 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతం వైరల్‌గా మారిన ఈ ట్రైలర్‌ను మీరు కూడా చూసేయండి. ఈ వెబ్ సిరీస్‌కు కిరణ్ కె కరవళ్ళ దర్శకత్వం వహిస్తుండగా.. ఎస్కేఎన్ నిర్మిస్తున్నాడు.





# యోగ, ఆయుష్ సేవలపై స్పష్టత ఇవ్వండి



☐ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** హెర్బల్ మందుల నాణ్యత: దేశంలో హెర్బల్ ఔషధాల నాణ్యత ప్రమాణాలు పాటించేలా ప్రభుత్వం ఎలాంటి పర్యవేక్షణ వ్యవస్థ అమలు చేస్తోంది? లైసెన్స్ పొందిన తయారీదారుల సంఖ్య ఎంత? గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తున్న కొరతను నివారించేందుకు ఏ చర్యలు తీసుకున్నారో అనే అంశాలపై పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పార్లమెంట్ లో స్పష్టత కొరారు. గత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నిర్వహించిన జాతీయ, ప్రాంతీయ యోగా క్యాంపైన్ల వివరాలు, వాటిలో పాల్గొన్న వారి సంఖ్య, కేటాయించిన బడ్జెట్‌ను వెల్లడించాలన్నారు. దేశంలో యోగా ప్రచారం, హెర్బల్ ఔషధాల నాణ్యత, గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్ సేవల విస్తరణ వంటి కీలక అంశాలపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఈ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతున్నారో తెలియజేయాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్ సేవల విస్తరణ, సేవలను గ్రామీణ ప్రాంతాలకు చేరవేయడానికి ప్రభుత్వం ఎన్ని మొబైల్ యూనిట్లు పంపిణీ చేసింది? ఇప్పటివరకు ఎన్ని గ్రామాలు వీటి పరిధిలోకి వచ్చాయి? స్థానిక స్వయం సహాయక సంఘాలతో చేపట్టిన సహకార కార్యక్రమాలపై వివరాలు ఇవ్వాలని కోరారు. అయితే కడియం కావ్య అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి గణపత్రావ్ జాదవ్ సమాధానమిచ్చారు. 2025 అంతర్జాతీయ యోగా దినోత్సవం 'వన్ ఎర్త్.. వన్ హెల్త్' థీమ్‌తో నిర్వహించగా, విశాఖపట్నంలో ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన మహార్యాలీకి 3.02 లక్షల మంది హాజరయ్యారన్నారు. దేశవ్యాప్తంగా 13.64 లక్షల యోగ సంగమ్ ఈవెంట్లు నిర్వహించినట్లు తెలిపారు. 2024 యోగా దినోత్సవం 'యోగా ఫర్ సెల్ఫ్, సొసైటీ' థీమ్‌తో శ్రీనగర్‌లోని దాల్ సరస్సుపై ఏడు వేల మంది ప్రధాన కార్యక్రమం నిర్వహించామన్నారు. జమ్మూ–కాశ్మీర్ జిల్లాల్లో మరో 20 వేల మంది పాల్గొన్నారని తెలిపారు. పుణే, సూరత్, బోధ్ గయాల్లో జరిగిన ప్రీ–ఈవెంట్లకు వేలాది మంది హాజరయ్యారని వివరించారు. 2024–25లో యోగ, ఆయుష్ ప్రచారం కోసం ఐఈసీ పథకం కింద రూ.43.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. హెర్బల్, ఆయుష్ మందులకు ప్రమాణాలు నిర్ణయించే బాధ్యత ఫార్మకోపియా కమిషన్‌దని మంత్రి తెలిపారు. ఉత్పత్తి, ఎగుమతులు, మౌలిక వసతులు బలోపేతానికి 'AOGUSY' పథకం క్రింద చర్యలు చేపట్టామన్నారు. 34 రాష్ట్ర ల్యాబ్‌లు అప్‌గ్రేడ్ చేయబడి, 108 ల్యాబ్‌లు టెస్టింగ్ కోసం లైసెన్స్ పొందినట్లు వెల్లడించారు. జాతీయ ఆయుష్ మిషన్ కింద 150 గిరిజన గ్రామాలకు మొబైల్ యూనిట్లు వెళ్లి, మూడు లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు, మందులు, యోగ తరగతులు అందించాయని మంత్రి తెలిపారు. 'ఆయుష్ గ్రామం' ప్రాజెక్ట్ ద్వారా స్వయంసహాయక సమూహాలతో కలిసి ఆరోగ్య అవగాహన, జీవనశైలి మార్పులు, ఇంటివద్ద హెర్బల్ చికిత్సలపై ప్రచారం జరుగుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో సమగ్ర హోలిస్టిక్ హెల్త్ సేవల లోటు ఉన్నదన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం స్పందించి, ఆయా సేవల విస్తరణపై చర్యలు కొనసాగిస్తామని కేంద్ర మంత్రి తెలిపారు.

# రాజీతోనే సమస్యల పరిష్కారం

- లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్ వాయిస్, క్రైం :** రాజీతోనే సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ఈ నెల 21వ తేదీ ఆదివారం నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకుగాను కమిషనరేట్ పోలీసులు రూపొందించిన వాల్ పోస్టర్లను సీపీ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ తదితర కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉందన్నారు. రాజీయే రాజ మార్గమని సూచించారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేట్లు అవగాహన కల్పించాలన్నారు. తమ కేసుల్లో రాజీ పడాలని భావించినవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఏఎస్పీ శుభం, ఏసీపీ డేవిడ్ రాజు, ఇన్ స్పెక్టర్లు రమేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నవీన్ రాజ్ పై ఎఫ్ఐఆర్




☐ డివిజన్ అధ్యక్షుడిపై దాడే కారణం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ప్రధాన అనుచరుడు నవీన్ రాజ్ పై కేసు నమోదైంది. 25వ డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సాజిద్ పై దాడి ఘటనలో ఆయనపై కేసు నమోదు చేశారు. నవీన్ రాజ్ తీరుపై వాట్సాప్ గ్రూపుల్లో ఆడియోలు పెట్టినందుకు తనను కత్తితో బెదిరించి, దాడి చేశారన్న సాజిద్ ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ సెక్షన్లు 118, 296, 351 కింద నవీన్ రాజ్ తో పాటు అతని అనుచరులపై ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు.

# పనుల పురోగతిపై సమీక్ష

**పాల్గొన్న ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లాలో చేపడుతున్న భూ సేకరణపై ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆరా తీశారు. ఎయిర్పోర్ట్, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ప్రాజెక్టు నిర్వహణ, విధి విధానాల గురించి సంబంధిత అధికారులతో సమీక్షించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వరంగల్ ఎయిర్‌పోర్ట్, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో వరంగల్, తహసిల్దార్ ఖిలా వరంగల్, జోనల్ మేనేజర్ టీజీఐసీసీ, ఏడీఎస్ఎల్ఆర్, తదితరులు పాల్గొన్నారు. తొలుత వరంగల్ విచ్చేసిన ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడుకు వరంగల్ కలెక్టర్ పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

# తప్పుడు ఆరోపణలు చేస్తే కాళ్లు విరగ్గొడుతా

- కవిత సీరియస్ హెచ్చరిక
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావులకు నోటీసులు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, టీ న్యూస్‌లకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం లీగల్ నోటీసులు పంపించారు. ఈ నోటీసులో పలు అంశాలను ప్రస్తావించారు. తనపై, తన భర్త అనిల్‌పై ఆధారాలు లేని ఆరోపణలు చేశారంటూ నోటీసులో తెలిపారు. వారం రోజుల్లో తనకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయం తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



# బీజేపీ విజయఢంకా..

- స్థానిక ఎన్నికల్లో చాటిన సత్తా
- ఫలించిన బీజేపీ నాయకుల కృషి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగించింది. గురువారం మొదటి విడతలో జిల్లాలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసింది. వర్ధన్నపేట మండలంలోని కట్రియాల, పర్వతగిరి మండలం బట్టుతండా గ్రామాల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు రాయపురం రమ్య రాజు, బట్టు మంజుల రాంబాబులతోపాటు 14 మంది వార్డు సభ్యులుగా గెలుపొందారు. బరిలో గెలుపొందిన వారికి బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ఇంచార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కొండపల్లి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి నాయకులు అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించడంలో సఫలమయ్యారు. దీనికి అభ్యర్థుల చరిష్మ కూడా తోడయిందని వ్లెలడించారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతోనే గ్రామాల్లో సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పార్టీ ప్రాబల్యం మరింత పెరగడం ఖాయమన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన సర్పంచ్, వార్డుల సభ్యులు విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోదీతోనే దేశ ప్రగతి సాధ్యమని, ఈ విషయం పల్లెవాసులూ గుర్తించారన్నారు. అందుకే విజయం కట్టబెట్టారన్నారు. ఇదే ఉత్సాహంతో రానున్న ప్రతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ప్రభారీ జలగం రంజిత్ రావు, బీజేపీ నాయకులు జడ సతీష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com